
# సహాయం

భీమవరపు పురుషోత్తం




విష్ణుమూర్తిమాటలు విని తెల్లబోయాను. ఏం మాట్లాడాలో ఎలా స్పందించాలో అర్థం కాలేదు. స్నేహితుడు నలిగిపోయి బాధల్లో ఉన్నట్టు తెలుస్తూనే ఉన్నా సాయం చేసే ఉద్దేశ్యమైతే మనసులో లేదు.

కూతురు పెళ్ళికని అందుబాటులో వున్న లోన్లన్ని తీసుకొని, కూడబెట్టిన డబ్బంతా పోగుచేసుకునే ప్రయత్నాల్లో ఉన్నాను. ఎంత వస్తుందో లెక్కలు వేసుకుంటున్నాను.

ఇలాంటి సమయంలో దీనంగా వచ్చి యాభైవేలు అడుగుతున్నాడు. అతడి కష్టాలు నా చెవికెక్క లేదు. కళ్ళముందు కూతురు పెళ్ళి అంగ రంగ వైభవంగా జరగడమే కనిపిస్తోంది.

''నెల రోజుల్లో మా అమ్మాయి పెళ్ళుంది. అది నీకు తెలిసే వుంటుంది.ఇలాంటప్పుడు డబ్బడగటం ఏమయినా బావుందా? ఇప్పుడు డబ్బు బయటికి తీసే ప్రశ్నే లేదు...'' అంటూ కోప్పడ్డాను.

''ఒరే నారాయణా! మన స్నేహాన్ని మర్చిపోకురా. ఈ సమయంలో అడగటం తప్పైనా తప్పదురా. నా కూతురి జీవితం నీ చేతుల్లోనే వుంది. నీకు ఇద్దరు కూతుర్లనుకుని దాని కాపురాన్ని నిలబెట్టరా. నా సంగతి తెల్సి ఎవ్వరూ ఎంత వడ్డీకైనా అప్పివ్వనంటున్నారు. అమ్మడానికి కూడా నా దగ్గర ఏమీ లేవు. నాకు మిగిలిన ఏకైక ఆధారం నువ్వేరా. తర్వాత నీ బాకీ ఎలా అయినా తీర్చేస్తానురా. నా పిల్లల మీద ఒట్టు.. ప్లీజ్ అర్థం చేసుకోరా'' అంటూ




ప్రాధేయపడసాగేడు.

''బాకీ తీరుస్తావు సరే. ఇప్పుడు నేనిచ్చే స్థితిలో లేను. పెళ్ళికి చాలా ఖర్చులున్నాయి'' అంటూ అతి కష్టం మీద వాడిని వదిలించుకుని వచ్చేశాను.

వర్షం వచ్చేలా వుంది. తొందరగా ఇంటికి చేరుకున్నాను. అప్పటికే బాగా రాత్రయ్యింది. మా పక్క వీధే విష్ణుది. ఇంటికి వస్తాడేమోనని భోజనం చేసి తొందరతొందరగా నిద్రకుపక్రమించాను. వర్షం నీళ్ళు కిటికీ అద్దాలపై పడి క్రిందికి కారటం విన్పిస్తోంది.

* * *

విష్ణుమూర్తి నాకు కాలేజీలో స్నేహితుడు. సహృదయుడు. ప్రస్తుతం ఉద్యోగం హోదా జీతం అన్నింటిలోనూ మా ఇద్దరికీ హస్తిమశకాంతరం అంత తేడా వుంది. నేను చాలా మెట్లు పైనున్నాను.

వాడి చిరుద్యోగానికి తోడు తాగుడు, చీట్ల పేక అలవాటయ్యాయి. పైగా ముగ్గురు ఆడపిల్లలు. అందులో ఇద్దరు పెళ్ళికెదిగారు.

సంవత్సరం క్రితం విష్ణుమూర్తి పెద్దకూతురు వసంత పెళ్ళి జరిగింది. పేదవాడింట్లో పెళ్ళి అర్థం మార్చుకుని హంగులు కోల్పోయి తూతూ మంత్రంలా ఉంటుందంటారు. ఇక్కడా అదే జరిగింది.

పెళ్ళికి యాభైవేల కట్నం మాట్లాడుకున్నారు. విష్ణుమూర్తి పెళ్ళిఖర్చులు ఎలాగో తంటాలు పడ్డాడు. సమయానికి కట్నం డబ్బులు చేతికందక ఇవ్వలేకపోయాడు. అదృష్టం బావుండి పదివేలు మిగిలితే అల్లుడికిచ్చి కాళ్ళూ వేళ్ళూ పట్టుకుని తర్వాత యాభైవేలు ఇస్తానని బ్రతిమలాడి సర్దిపుచ్చాడు. పెళ్ళి జరిగిపోయింది.

అల్లుడు అప్పటినుంచీ కట్నం డబ్బు అడుగుతూనే వున్నాడు. వియ్యపురాలు మంచిది కాదు. కోడల్ని డబ్బుకోసం రాచి రంపాన పెడుతోందిట. ఈమధ్యన అల్లుడి వ్యాపారం బాగా దెబ్బతిని తిండికి కూడా లేకుండా అయిపోయారట.

ఆ యాభై వేల కట్నం వాళ్ళకిప్పుడు అత్యవసరం అయ్యింది. అది వుంటే వ్యాపారంలో నిలదొక్కుకోవచ్చునని ఆ డబ్బు తెచ్చాకే కాపురానికి రమ్మని, అంతవరకూ గడప తొక్కద్దని భర్త, అత్తగారూ వసంతను పుట్టింటికి గెంటేశారు.

వసంత పరిస్థితి మూలిగే నక్కమీద తాటి పండు పడ్డట్టయింది. యథాప్రకారం విష్ణుమూర్తి దగ్గర చిల్లిగవ్వలేదు అప్పు తప్ప. అప్పిచ్చే దిక్కు లేదు. పెళ్ళాం ఒంటిమీద ఒక్క నగకూడా లేకుండా చేశాడు. ఇహ... వాడి కంటికి నేనే అంతిమ రుణదాతలా కనబడుతున్నాను.

మర్నాడు- విష్ణుమూర్తి నన్ను డబ్బడిగిన సంగతి విని, మా ఆవిడకు భలే కోపం వచ్చింది. ''ఎంత స్నేహితుడైతే మాత్రం.. మనింట్లో పెళ్ళి మనకు ముఖ్యం! ఎవరెలా పోతే మనకేంటి? డబ్బు ఇవ్వటం కుదరదని విష్పష్టంగా చెప్పెయ్యండి'' అని అల్టిమేటం ఇచ్చింది.

ఆమె చెప్పింది నిజమే. రమ్య మా ఒక్కతే కూతురు. ఆమె పెళ్ళి ఏ లోటూ లేకుండా చేద్దామని మా ఆకాంక్ష! నాకు కాబోయే అల్లుడిది మంచి హోదా కలిగిన ఉద్యోగం. మంచి సంబంధం. వాళ్ళకు తగ్గట్టుగా చేద్దామని ప్రతి పైసా ఈ పెళ్ళికే ఖర్చుచేస్తున్నాను.

మర్నాడు విష్ణుమూర్తి డబ్బుకోసం మళ్ళీ వచ్చినప్పుడు ఖరాఖండీగా డబ్బివ్వనని చెప్పేశాను. వాడు బ్రతిమలాడి చివరికి ఖిన్నుడై వెళ్ళిపోయాడు. ఒక పేదపిల్ల కాపురం నిలబెట్టే ఆ యాభైవేలూ నాకు ఆఫ్టరాలే కావచ్చు... కానీ వాటితో నా కూతురికి ఒక మంచి నగ కొనగలను కదా!

* * *

ఒకరోజు మేడమెట్లు దిగుతూ మా ఆవిడ వసుమతి కాలు మెలికపడి పడిపోయింది. హాస్పిటల్‌కి తీసుకువెళితే మోకాలి దగ్గర ఎక్స్‌రే తీసి ఫ్రాక్చర్ అయ్యిందని చెప్పారు. నెలరోజులుపైనే ఆమె బెడ్ రెస్టు తీసుకోవాలి. కట్టు వేయించాను. మందులూ అవీ తీసుకున్నాం. పెళ్ళి నెలరోజులుండనగా, ఇలా జరిగిందేమిటా అని మథనపడ్డాను. మా బంధువులంతా పెళ్ళికి వచ్చి వెళ్లిపోయేవారేగానీ ముందుగా వచ్చి సాయం అందించే వాళ్లెవరూ లేరు. ఇప్పుడు మా ఆవిడని చూసుకోవటానికి కూడా తెలిసిన వాళ్ళొకరు కావాలి.

హాస్పిటల్ నర్సులు సరిగా చూడరు. ఎలా? అని తర్జన భర్జనలో వున్నాను. బంధువుల్ని కొందరిని అడిగి చూశాను. వాళ్ళ కారణాలు వాళ్ళు చెప్పారు రాకపోవడానికి.

ఇంటికి సున్నాలు రంగులు వేయించాలి. ఇంటి చుట్టూ ఖాళీస్థలం బాగావుంది. పిచ్చిమొక్కలు అవీ పెరిగి అసహ్యంగా వుంది. ఇంట్లో సామాను పాతబడి 'లుక్' బావోలేదు. నాకు ఆఫీసులో బండెడు పని వుంది. పెళ్ళికి నాల్రోజులు లీవు పెట్టగలను అంతే.

నా భార్య తిరగ్గలిగితే నాకు కొండంత బలం వుండేది. వసుమతికి నాకంటే బాధగా వుంది. మంచం మీంచి ఎన్ని పనులని చేయించగలదు. ఇలాంటప్పుడు తిరగ్గలిగుండాలి. లేదా తిరిగే వాళ్ళుండాలి.

ఇద్దరికీ కంటిమీద కునుకులేదు పెళ్ళి ఎలారా దేవుడా అని! ఎన్ని కలలు కన్నాం ఈ పెళ్ళి గురించి...

నిజంగానే దేవుడు పంపినట్టు ఓ రోజు విష్ణుమూర్తి, అతని భార్య, పెద్ద కూతురు వసంత వచ్చారు. వసంత పుట్టింట్లోనే వుంటుంది. మా ఆవిడకి దెబ్బ తగిలినట్టు వాళ్ళకిప్పుడు తెలిసిందట. మొదట నేను డబ్బుకోసమేమో అనుకున్నాను.

విష్ణుమూర్తి భార్యా, మా ఆవిడా పెళ్ళిపనుల గురించి చర్చించుకున్నారు.

విష్ణుమూర్తి నాకు ధైర్యం చెప్పి, తన భార్యకు ఇంటిదగ్గర తీరదని, మాకభ్యంతరం లేకపోతే ఖాళీగా వున్న కూతురు సాయపడగలదని అడిగాడు. మా ఆవిడ మా ఇద్దరి తరపున 'సరే' అంది. నేను మౌనం వహించాను.

వాళ్ళు వెళ్ళిపోయాక వసంత ఆరిందాలా కొందరు పనివాళ్ళను పిలిపించి వాళ్ళకు పని పురమాయించడం చేయించడం మొదలెట్టింది. ఇక సలహాలకు మా ఆవిడ ఉండనే వుంది. ఆవిడకు మందులవీ వేయించడం, దగ్గరుండి చూసుకోవడం మొదలైన పనులు కూడా వసంతవే.

మొదట ఈ చిన్నపిల్లా? అనుకున్నాను. సమయానికి ఎవరైతేనేమి అని మళ్ళీ ఊరుకున్నాను. ఆమె మా ఇంట్లోనే వుండసాగింది. తిండీ నిద్రా ఇక్కడే. మూడు నెలల గర్భిణి కూడా ఆ అమ్మాయి. కానీ అదేమీ లెక్కచేయకుండా ఇంట్లో పనులన్నీ నెత్తినేసుకుంది. మా ఆవిడకీ నాకూ మనసులో గిల్టీగానే వుంది ఆమెను చూస్తుంటే.

సొంత చెల్లెలి పెళ్ళిలా భావించి చేస్తోంది వసంత. రమ్య, ఆమె ఇద్దరూ ఒక ఈడువారే. ఒకే కాలేజి. ఒకే బెంచి. పైగా స్నేహితురాళ్ళు.

పనులు ఒక్కోటి అయిపోతుంటే నా గుండెలు

మళ్ళీ కుదుట పడ్డాయి. మా ఆవిడ ముఖంలో నవ్వు కనిపించింది. వసంత ఇల్లు తీర్చిదిద్దింది.

మా ఇల్లు నిజంగా పెళ్ళి వారిల్లులా వుందిప్పుడు. చుట్టూ అవసరం లేని మొక్కలన్నీ కొట్టించేసి ఖాళీ ప్రదేశాల్లో పూలకుండీలు తెప్పించి నింపింది వసంత. పాత సామాను వెనుక రేకుల షెడ్డులో వేయించి, ఉన్న ఫర్నిచరుకి కొంత కొత్త ఫర్నిచరు తెప్పించి వాటిని అందరికీ అనుకూలంగా ఉండేటట్టు సర్దించి ఇంటికి కళ తెచ్చింది.

నేను డబ్బుకోసం చూసుకోవద్దని ముందే చెప్పించాను మా ఆవిడ చేత. ఎంత ఖర్చయినా ఫర్వాలేదని ఇంటికి కొత్త అందం రావాలని పదే పదే చెప్పాను. నేను మనసులో అనుకున్నది వసంత ముందే ఊహించిందా అన్నట్టు మార్చివేసింది.

వెడ్డింగ్‌కార్డ్స్, చీరల నగల షాపింగులాంటి సరదాలకు రమ్యకు, వసంత తోడు దొరికింది. విష్ణుమూర్తి అతని భార్య మధ్యలో రెండు మూడు సార్లు వచ్చి వెళ్ళారు.

పెళ్ళి అనుకున్నది అనుకున్నట్టుగా చాలా గ్రాండ్‌గా సెలబ్రిటీగా జరిగింది. అన్నిటిలోనూ వసంత మార్కు సుస్పష్టంగా కనిపించింది. పెళ్ళికొచ్చిన వాళ్ళకు ఎవ్వరికీ ఏ ఇబ్బందీ జరగలేదు. పైగా అందరూ ఆమెను మెచ్చుకునేవాళ్ళే.

నాకూ మా ఆవిడకు సంతోషానికి అవధుల్లేవు. ముందు కంగారుపడినట్టే లేదు పెళ్ళి. అప్పగింతలప్పటికి కూడా మా ఆవిడకి కట్టు తీయడం కుదరలేదు. కనీసం మరో రెండు రోజులాగాలన్నాడు డాక్టరు.

వసంతే దగ్గరుండి సాగనంపింది రమ్యను. ఈ పెళ్ళి తంతంతా ఆమె చేతులమీదుగానే జరగాలనున్నప్పుడు ఎవరు మాత్రం ఏం చేయగలరు.

వసంత ఏ పనిచేసినా ఒక పనిలా దాన్ని చేయలేదు. హృదయనివేదనలా చేసింది. ఓరిమికున్న అపారమైన శక్తిని ఆమె ప్రదర్శించింది. ఆమె నిస్వార్థత నన్ను ఆకర్షించింది.

* * *

రమ్య అత్తారింటికి వెళ్ళిన రాత్రి మా ఆవిడకు మందులు వేసి వసంత మంచినీళ్ళు పెట్టడానికి నా గదిలో కొచ్చింది.

''చూడమ్మా! నీవేగనుక లేకపోతే ఈ పెళ్ళి ఇంత బాగా జరిగేది కాదు'' అన్నాను.

ఆమెతో నేను మాట్లాడింది చాలా తక్కువ. ఆమె నవ్వి ఊరుకుంది. నేనింకేదో మాట్లాడాలని ''నీ కాపురం చెడిపోయిందట.. కట్నం ఇవ్వలేదని మీ అత్తగారు నిన్ను సరిగా చూడ్డం లేదట. విష్ణుమూర్తి చెప్పాడు'' అన్నాను లాలనగా.

ఆమె ఊపిరి స్తంభించింది. చకిత అయింది. మస్తిష్కంలో ఏముందో బ్రహ్మకే తెలియాలి. కళ్ళు విచలత్వంతో పక్కకి తిప్పుకుంది. క్రమేపి అవి చెరువుల్లా అయ్యాయి. ఆమె తండ్రి నన్ను డబ్బడిగినట్టు- నేను కాదన్నట్టు ఆమెకేం తెలీకపోవచ్చు.

చీమ కష్టాలు చీమవన్నట్టు, చీమ ఔన్నత్యం కూడా చీమదే. తన గోడు వెళ్ళబోసుకోవడానికి ఆమెకు ఆత్మాభిమానం అడ్డొచ్చింది. మౌన సముద్రంలా, స్నిగ్ధ గాంభీర్యంతో వుండటం ఆమె సహజ స్వభావం కావచ్చు. కానీ జీవితగతి ఆమెను పరీక్షిస్తుంది.

ఆమె కన్నీటి బొట్లు పాలరాతి గచ్చుపై పడిపోయాయి. కృతజ్ఞత ప్రదర్శించబోయి ఆమె గాయాన్ని ఎందుకు కెలికానా అని.. పావురానికి బాణం వేసిన వాల్మీకిలా చింతనలో పడ్డాను.

నిశ్శబ్దం మిగిలింది. ఇద్దరి మనసులు యథాస్థానాలలో వుండిపోయాయి. ఆమె నిష్క్రమించింది. లైటార్పి నిద్రకుపక్రమించాను. వసంత నీళ్ళు నిండిన కళ్ళే నా మనోఫలకంపై ప్రత్యక్షమయ్యాయి. అన్యమనస్కంగా అటూ ఇటూ దొర్లాను.

భగవంతుడి దృష్టిలో వున్న ఏకత సృష్టిలో లేదు. రమ్య వసంతల, వయసు, చదువు, ఆలోచన్లు కోరికల్లో వున్న సారూప్యం జీవితానుభవాల్లో లేదు. రమ్య నా కడుపున పుట్టి ఏ లోటూ లేకుండా పెరిగింది. అనుకూలమైన భర్తతో ఘనంగా పెళ్ళి జరిగింది. ఇకముందు కూడా ఆమె జీవితానికి లోటూ లేదు.

కానీ వసంత జీవితం అలా లేదు. తినడానికి మంచి తిండి, కట్టుకోడానికి మంచి బట్ట వుండటానికి మంచి ఇల్లు లేక అలమటించింది. రమ్యలాంటి తోటి పిల్లల్ని ఆశగా చూసిందే తప్ప ఈర్ష్యపడలేదు.

ముగ్గురాడపిల్లల ఇరుకు ఇంటిలో ఎవడో ఒకడు తాళికట్టి ఈ కన్నెచెర విడిపిస్తే చాలని మొండిగా బ్రతికింది. సగటు అమ్మాయిల్లా ఆశలకు పోకుండా ఔన్నత్యాన్ని పెంచుకుంది. అందుకే కష్టాలను కమండలంలో బంధించగలిగింది.

కడుపుతో వుండి కూడా స్నేహితురాలి పెళ్ళికి తన కష్టాలు మర్చి, సాయం అందించటం ఆమె పరిణతిని సూచిస్తుంది. మాలా ఎవరెలా పోతే మనకేంటి? అన్న ధోరణి ఆమెలో లేదు. ఎంత నిగ్రహించుకున్నా ఆమెను మనసులో ప్రశంసించకుండా వుండలేకపోయాను. అలాంటి కూతురు వుంటే బావుండుననిపించింది... వెంటనే ఒక నిర్ణయానికి వచ్చాకే నాకు నిద్రపట్టింది!

* * *

ఉదయాన్నే రెడీ అయి పనుందని వసుమతికి చెప్పి నా కారులో దగ్గరలో వున్న వసంత అత్తారింటికి ప్రయాణమయ్యాను.

నా పక్కనే ఓ సూట్‌కేసు ఉంది. అందులో యాభై వేలున్నాయి. వసంత నాకు చేసిన పనికి వెలకట్టి ఈ డబ్బు ఆమె అత్తింట్లో ఇవ్వబోవటం లేదు. ఆమె సమస్యను సరియైన కోణంలో స్పృశించే అవకాశం నాకు దక్కింది.

...డబ్బున్న నాకు నిజానికి ఈ యాభైవేలు ఓ లెక్కలోనివి కాదు. కానీ ఇవి ఓ నిండు జీవితాన్ని నిలబెట్టగలవు. అలాంటప్పుడు వీటిని వెచ్చించడం మనిషిగా నా ధర్మం! ఈ పరోపకార గుణం వసంత దగ్గర్నుంచి నేర్చుకున్నదే!

ఒక్కటి మాత్రం నిజం... నేనామెకు చేసే ఈ సహాయం, తర్వాత ఆమెకు ఏ రూపేణైనా అందేదేమో. కానీ నా కూతురి పెళ్ళికి ఆమె చేసిన సహాయం మాత్రం కేవలం ఆమెకే సాధ్యం!

ఆ సహాయాన్ని నేను నా జీవితాంతం నా గుండె పొరల్లో నిక్షిప్తం చేసుకుంటాను.

★

